అన్నదాత సుఖీభవ


పేదలు, అభాగ్యులకు ఆహారం ప్యాకెట్లు అందిస్తున్న స్నేహితులు సత్యనారాయణ, కుమార్


పంపిణీకి సిద్ధం చేసిన భోజనం ప్యాకెట్లు, పండ్లు, బియ్యం

- అక్కయ్యపాలెంలో 12 ఏళ్లుగా అన్నదానం చేస్తున్న ఇద్దరు మిత్రులు
- ప్రతీ ఆదివారం మధ్యాహ్నం వంద మందికి ఆహారం పంపిణీ
- ఆదర్శంగా నిలుస్తున్న దాతలు ఎం.వి.వి.సత్యనారాయణ, జి.వి.కుమార్
- సంపాదనలో కొంత భాగం సామాజిక సేవకు వెచ్చించాలని పిలుపు

సీతంపేట: అన్నదానానికి మించిన దానం లేదు. ఆకలితో అలమటిస్తున్న వారికి పట్టెడు అన్నం పెడితే అంతకు మించిన పుణ్యం లేదని వేదాలు, పురాణాలు, శాస్త్రాలు చెబుతున్నాయి. కూటి కోసం ఒక్కొక్కరు ఒక్కో పని చేస్తూ పొట్ట నింపుకుంటున్నారు. పనిచేయలేని పరిస్థితిలో ఉన్నవారి మాటేమిటి, పస్తులుండాల్సిందేనా? కాదంటున్నారు వాగ్దేవి స్కూల్ ప్రిన్సిపాల్, రోటరీ క్లబ్ ఎడ్యుకేషన్ కమిటీ సభ్యుడు, భారత వికాస్ పరిషత్ సౌత్ రీజనల్ సెక్రటరీ ఎం.వి.వి.సత్యనారాయణ, ఆయన స్నేహితుడు వ్యాపారవేత్త జి.వి.కుమార్. సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ తాను సంపాదించిన దాంట్లో కొంత భాగం సామాజిక సేవకు వెచ్చించాలని అంటున్నారు. డబ్బులు సాయం చేసే కంటే ఆకలితో ఉన్న నిరుపేదలు, అభాగ్యులు, దివ్యాంగులకు పట్టెడు అన్నం పెడితే ఆకలి తీరాక అన్నదాత సుఖీభవ అంటూ వారు అందించే దీవెనలు మన కుటుంబాన్ని, పిల్లలను చల్లగా కాపాడుతాయని చెబుతున్నారు.

12 ఏళ్లలో వేలాది మందికి..

వృద్ధులు, దివ్యాంగులు, నిరుపేదలు, అనారోగ్య బాధితులు, పనిచేయలేని స్థితిలో ఉన్నవారు ఎవరో ఒక దాత అన్నం పెడతారని ఎదురుచూస్తుంటారు. ఇలాంటి వారి ఆకలి తీర్చాలన్న ఆలోచన వారిలో మొదలైంది. తమ వంతుగా వారానికి ఒకరోజు అయినా పేదల ఆకలి తీర్చాలని సంకల్పించారు. అనుకున్నదే తడవుగా 2012 జనవరి 4వ తేదీ నుంచి ప్రతి ఆదివారం అక్కయ్యపాలెం 80 ఫీట్ రోడ్డులోని వాగ్దేవి స్కూల్ ఆవరణలో వంద మందికి ఉచితంగా భోజనం అందజేస్తున్నారు. గడిచిన 12 ఏళ్లలో వేలాది మంది ఆకలి తీర్చారు. తన తల్లి సత్య సాయి భజన మండలి హెడ్‌గా పనిచేసే రోజుల్లో ప్రతి ఇంట్లో రెండు పిడికిల్లు బియ్యం ఎక్కువగా వండించి, ఆ భోజనాన్ని ప్యాక్ చేసి వాగ్దేవి స్కూల్ వద్ద పంచిపెట్టేవారని, అదే స్ఫూర్తితో అన్నదానం ప్రారంభించామని సత్యనారాయణ తెలిపారు. వ్యాపాత వేత్త మట్టపల్లి చలమయ్య చేతుల మీదుగా అన్నదాన కార్యక్రమం ప్రారంభించామన్నారు. అన్నదానం ఒక్కటే కడుపు నింపుతుందని, ఇక చాలు అని ఎదుటి వారు సంతృప్తి చెంది దీవించేది ఒక్క అన్నదానానికే అని గర్వంగా చెబుతున్నారు. దాతలు సాయమందిస్తే ప్రతి రోజూ అన్నదానం చేసేందుకు కృషి చేస్తామని ఎం.వి.వి.సత్యనారాయణ, జి.వి.కుమార్ తెలియజేశారు.

అన్నార్తుల ఆకలి తీర్చడంలో సంతృప్తి



మహా నగరం విశాఖలో ఎంతో మంది అభాగ్యులు పట్టెడు అన్నం కోసం ఎదురుచూస్తున్న పరిస్థితి. డీఆర్‌ఎం ఆఫీస్ నుంచి రైల్వే స్టేషన్ మధ్య సుమారు 200 మంది భోజనం కోసం నిత్యం ఎదురుచూస్తుంటారు. మురికివాడలు, ఆలయాలు, ఫంక్షన్ హాళ్లు, హోటళ్ల వద్ద ఎంతోమంది అన్నం కోసం నిరీక్షిస్తుంటారు. ఇలాంటి వారికి తమ వంతుగా ఒక్కపూట ఆకలి తీర్చాలని నా స్నేహితుడు కుమార్‌తో కలిసి ఆదివారం మధ్యాహ్నం 100 మందికి భోజనం అందజేస్తున్నాం. నెలకు ఒకసారి బియ్యం, దుప్పట్లు, పాత దుస్తులు, పండ్లు పంచిపెడుతున్నాం. భారత వికాస్ పరిషత్, రోటరీ క్లబ్ ద్వారా సేవా కార్యక్రమాలు చేస్తున్నాను.

– ఎం.వి.వి.సత్యనారాయణ, భారత వికాస్ పరిషత్ సౌత్ రీజనల్ సెక్రటరీ

అన్నదాన సేవలో భాగం కండి



భగవంతుడు ఇచ్చిన దాంట్లో ఎంతో కొంత సాటివారి ఆకలి తీర్చడానికి ఖర్చు చేయాలన్నదే మా ఆలోచన. మనం మూడు పూటలా తింటున్నాం. ఈ పూట కడుపు ఎలా నిండుతుందో అని ఎదురుచూస్తే అభాగ్యులు మన చుట్టూ ఎంతో మంది ఉన్నారు. ఆకలితో ఉన్నవాడికి కనీసం ఒక్కపూట అయినా కడపు నింపాలన్న ఆలోచనే అన్నదానానికి దారితీసింది. ప్రతి రోజూ ఆకలి తీర్చాలని అనుకుంటున్నాం. దాతలు ముందుకు వచ్చి సాయమందిస్తే రోజూ అన్నదానం చేస్తాం.

– జి.వి.కుమార్, వ్యాపారవేత్త, రాంనగర్

రోడ్డెక్కిన మురుగు


అపూర్వ ఆస్పత్రి రోడ్డులో చెత్తతో నిండిన డ్రెయిన్


దుకాణాల ముందు రోడ్డుపై నిలిచిన మురుగు నీరు

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డులో పారిశుధ్యం పడకేసింది. సీతంపేట మెయిన్ రోడ్ నుంచి అపూర్వ ఆస్పత్రి రోడ్డులో భాష్యం స్కూల్ వద్ద డ్రెయిన్ చెత్తతో నిండి మురుగునీరు రోడ్డెక్కి ప్రవహిస్తోంది. భాష్యం స్కూల్, శ్రీవిశ్వ కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, ఆస్పత్రికి వెళ్లే రోగులు ఇబ్బంది పడుతున్నారు. వర్షాలు కురుస్తున్న వేళ.. ఆ మార్గంలో ఉన్న దుకాణాల ముందు మురుగు నీరు నిలిచి పోవడంతో వ్యాపారులు బేరాలు లేక ఉసూరుమన్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి తగు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

30న ఉచిత వైద్య శిబిరం

మురళీనగర్: వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 30న ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు ఎస్.లలితారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. తాటిచెట్లపాలెంలోని చిట్టిబాబు కాలనీ మెహర్ బాబా ధ్యాన మందిరంలో ఉదయం 9.30 గంటల నుంచి ఏబీ మెడికల్ సర్వీసెస్ సహకారంతో శిబిరం జరుగుతుందన్నారు. గైనకాలజిస్ట్ డాక్టర్ వినీల మేడపాటి, నియో విజన్ నేత్ర వైద్య నిపుణుడు డాక్టర్ బి.బాలకృష్ణ, కీళ్ల వ్యాధుల నిపుణుడు డాక్టర్ ఎడ్ల దిలీప్ రాజాతోపాటు జనరల్ ఫిజీషియన్, ఇతర వైద్య సిబ్బంది పాల్గొని ఉచితంగా వైద్య పరీక్షలు చేస్తారని చెప్పారు. తాటిచెట్లపాలెం పరిసర ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

పారిశుధ్య కార్మికుల పాత్ర కీలకం


లింగాల ఆదినారాయణను సత్కరిస్తున్న పబ్లిక్ హెల్త్ కార్మికులు

కంచరపాలెం: వార్డు అభివృద్ధిలో పారిశుధ్య సిబ్బంది పాత్ర కీలకమని కార్పొరేటర్ గంకల కవిత అన్నారు. జీవీఎంసీ 48వ వార్డు కార్యాలయంలో గురువారం శానిటరీ మేస్త్రీగా 40 ఏళ్ల విధులు నిర్వహించి పదవీ విరమణ చేసిన లింగాల ఆదినారాయణకు కార్పొరేటర్ కవిత, జోన్-5 పబ్లిక్ హెల్త్ సిబ్బంది, బీజేపీ సీనియర్ నాయకుడు గంకల అప్పారావు సత్కరించారు. కరోనా వంటి కష్టకాలంలో పారిశుధ్య కార్మికులు ఎనలేని సేవలు అందించారన్నారు. ఆదినారాయణ ఆయురారోగ్యాలతో ఆనందంగా ఉండాలని తోటి కార్మికులు అభినందనలు తెలిపారు.

జిల్లా గ్రంథాలయ భవన నిర్మాణానికి ఉద్యమమే శరణ్యం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ఎంవీవీ శర్మ

అల్లిపురం: జిల్లా గ్రంథాలయ సంస్థకు చెందిన ఎకరా స్థలంలో గ్రంథాలయ భవన నిర్మాణానికి ఉద్యమమే శరణ్యమని మాజీ ఎమ్మెల్సీ ఎంవీవీ శర్మ స్పష్టం చేశారు. విశాఖ మహానగరంలో విద్యార్థులు, నిరుద్యోగులు, ప్రజలకు సరైన ప్రభుత్వ గ్రంథాలయం లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు, రాజకీయ నేతలకు గ్రంథాలయం అవసరం పట్టలేదని ఆయన ఆరోపించారు. డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో పౌరగ్రంథాలయ సేవా సమితి అధ్యక్షుడు బి.ఎల్.నారాయణ అధ్యక్షత జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా గ్రంథాలయ సంస్థకు చెందిన ఎకరా స్థలం నేటికి సీఆర్‌పీఎఫ్ వారి ఆధీనంలో ఉందన్నారు. గ్రంథాలయం పునర్నిర్మాణం కోసం కొత్త ప్రభుత్వం పూనుకోవాలని ఆయన కోరారు. గ్రంథాలయానికి నిధుల కొరత లేదన్నారు. అధికారం ఇస్తే గ్రంథాలయ భవన నిర్మాణం చేపడతానని జనసేన అధ్యక్షుడు పవన్ ఇచ్చిన మాట ఇప్పుడు నిలబెట్టుకోవాలన్నారు. లేకపోతే భవనం పునర్నిర్మాణం కోసం ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో గ్రంథాలయ సమితి రిటైర్డ్ కార్యదర్శి కె.త్రిమూర్తులు, కోశాధికారి పి.మల్లేశ్వరరావు, ఏయూ ప్రొఫెసర్ సుబ్బారాయుడు, సీహెచ్‌వీఎల్ఎన్ శాస్త్రి, పి.మణి, ఎస్.ప్రకాశరావు, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

స్టాటిస్టిక్స్ విభాగానికి పుస్తకాల బహూకరణ


వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి సమక్షంలో పుస్తకాలు అందజేస్తున్న ఆచార్య శ్రీనివాసరావు

ఎంవీపీ కాలనీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం స్టాటిస్టిక్స్ విభాగానికి పుస్తకాలు, జర్నల్స్‌ను మాజీ ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు బహూకరించారు. ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి సమక్షంలో గురువారం స్టాటస్టిక్స్ విభాగంలో ఈ కార్యక్రమం జరిగింది. గతంలో వర్సిటీ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పని చేసిన ఆచార్య కె.శ్రీనివాసరావు స్టాటస్టిక్స్ విభాగం ద్వారా వర్సిటీకి 40 ఏళ్లు సుదీర్ఘ సేవలు అందించారు. వివిధ హోదాల్లో వర్సిటీ ప్రగతికి కృషి చేశారు. తన పరిశోధనలకు సంబంధించిన పుస్తకాలు, జర్నల్స్ ఆల్బమ్స్‌తో పాటు ప్రముఖ వ్యాసాలతో కూడిన పుస్తకాలు విభాగ లైబ్రరీ ద్వారా విద్యార్థులకు ఉపయోగపడాలనే ఉద్దేశంతో బహూకరించారు. ఈ సందర్భంగా వీసీ ఆయన సేవలను ప్రశంసించడంతో పాటు 1300 పుస్తకాలు విభాగ లైబ్రరీకి అందించడంపై అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య జేమ్స్ స్టీఫెన్, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎంవీఆర్ రాజు, స్టాటస్టిక్స్ విభాగాధిపతి ఆచార్య మునిస్వామి, తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు ఆర్జిత సేవలు


నిత్య కల్యాణంలో తలంబ్రాల ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణ పుష్పార్చనను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ బేడా మండపంలో స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్ఠింపజేసి 108 స్వర్ణ సంపెంగలతో అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. ఉభయ దాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ ఏఈవో ఆనంద్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

- సింహాద్రి అప్పన్న స్వామికి గురువారం 9.30 గంటల నుంచి నిత్య కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.

గర్భిణులకు ఐరన్ మాత్రలు అందజేయాలి


లబ్ధిదారుల జాబితాలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: గర్భిణులకు ఐరన్ మాత్రలు అందజేయాలని, సాధారణ ప్రసవాలు జరిగేలా సిబ్బంది సహకారం అందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు కోరారు. గురువారం ఆరిలోవ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఆరోగ్య కార్యక్రమాలను, అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్, సెషన్ ప్లానింగ్, లబ్ధిదారుల జాబితాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలిచ్చారు. ముఖ్యంగా డయేరియాపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు ఆయన ఆదేశించారు. వర్షాకాలంలో కీటక జనిత వ్యాధులు రాకుండా చూసుకోవాలని, ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని డీఎంహెచ్‌వో సూచించారు. డీపీవో ఎన్‌హెచ్‌ఎం శశి భూషణ్, పట్టణ ఆరోగ్య కేంద్ర వైద్యులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైభవంగా కనకమహాలక్ష్మి అమ్మవారి పండగ


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

మద్దిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు సీతన్న గార్డెన్స్‌లో కొలువైన శ్రీకనక మహాలక్ష్మి అమ్మవారి పండగ వేడుకలు గురువారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త సనపల కీర్తి పర్యవేక్షణలో అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకుని, పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, 51వ వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు పేడాడ రమణికుమారి అమ్మవారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ ధర్మకర్త అమ్మవారి చిత్రపటం జ్ఞాపికను అందజేశారు.

కూలిన చెట్టు కొమ్మలు


నార్త్ ఎక్స్‌టెన్షన్ రోడ్డులో విరిగిపడిన చెట్టు కొమ్మలు

సీతమ్మధార: నగరంలో బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి పలు చోట్ల చెట్టు కొమ్మలు కూలిపోయాయి. సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్ ఎస్ఎఫ్ఎస్ స్కూల్ వెనుక గేటు రోడ్డులోని బడ్డీలపై చెట్టు కూలింది. ఆ సమయంలో ఎవరూ అక్కడ లేకపోవడంతో ఎటువంటి ప్రమాదం జరగలేదు. సీతమ్మధారలోని పలు ప్రాంతాల్లో చెట్టు కొమ్మలు విరిగిపడిపోయాయి. అధికారులు స్పందించి చెట్టు కొమ్మలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు మాక్‌డ్రిల్

మల్కాపురం: సంస్థలో జరిగే ప్రమాదాలు, విపత్తులు, అత్యవసర పరిస్థితుల్లో కార్మికులు వారిని వారు ఎలా రక్షించుకుంటారు, ఆపదలో ఉన్న వారిని ఎలా రక్షిస్తారు.. అనే అంశంపై కోరమాండల్ ఇంటర్నేషనల్ సంస్థలో శుక్రవారం ఉదయం మాక్‌డ్రిల్ నిర్వహించనున్నారు. డిస్ట్రిక్ అడ్మినిస్ట్రేషన్ వారి పర్యవేక్షణలో కోరమాండల్ సంస్థను ఆనుకుని ఉన్న పిలకవానిపాలెంలో మాక్‌డ్రిల్ జరుగుతుంది. సంస్థ నుంచి అగ్నిమాపక సిబ్బంది, అగ్నిమాపక శకటం, అంబులెన్స్ వంటి వాహనాలు వస్తాయని, వీటిని చూసి పిలకవానిపాలెం గ్రామస్తులు ఎటువంటి ఆందోళన, భయం చెందవద్దని సంస్థ అధికారులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

సీతమ్మధార: ఆశీలమెట్ట సెక్షన్ ఆఫీస్ పరిధిలోని 11 కేవీ పీ అండ్ టీ కాలనీ, 11 కేవీ వుడా కాంప్లెక్స్ ఫీడర్ల పరిధిలో మరమ్మతులు, చెట్టు కొమ్మల ట్రిమ్మింగ్ నిమిత్తం శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని జోన్-1 ఈఈ బి.సింహాచలం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఎస్ఎఫ్ఎస్ స్కూల్, వుడా కాంప్లెక్స్, టీపీటీ కాలనీ, ఎన్ఐఆర్ హాస్పిటల్, సీతమ్మధార పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

పోర్ట్ అథారిటీ బోర్డ్ మెంబర్‌గా పోతన్న



కంచరపాలెం: విశాఖ హార్బర్ పోర్ట్ వర్కర్స్ ఏఐటీయూసీ నుంచి యు.పోతన్న విశాఖ పోర్ట్ అథారిటీ బోర్డు మెంబర్‌గా నియమితుడయ్యారు. ఈ మేరకు పోర్ట్ మినిస్ట్రీ ఆఫ్ షిప్పింగ్ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా పోతన్నను యూనియన్ సభ్యులు, కార్మికులు అభినందించి ఘనంగా సత్కరించారు.

లలితా పీఠంలో ఆధ్యాత్మిక కవితా గోష్ఠి


నన్నయ సహస్రాబ్ది సంచికను ఆవిష్కరిస్తున్న సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి

సీతంపేట: లలితానగర్ శ్రీలలితా పీఠంలో జరుగుతున్న గురువుల ఆరాధనోత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం రచయిత డి.వి.సూర్యారావు ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కవితా గోష్ఠి నిర్వహించారు. 24 మంది కవులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కుర్తాళం శంకరాచార్యులు సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి చేతుల మీదుగా ఆదికవి నన్నయ సహస్రాబ్ది సంచికను ఆవిష్కరించారు. ఈ సభకు ఆచార్య కోలవెన్ను మలయవాసిని అధ్యక్షత వహించారు.

కవితా గోష్ఠి అనంతరం కవులను స్వామివారు సత్కరించారు. అనంతరం అనుగ్రహ భాషణం చేశారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. శుక్రవారం సాయంత్రం 6 గంటలకు భువన విజయం సాహితీ రూపకం ప్రదర్శన ఉంటుందని మేనేజర్ తెలిపారు.

ఖాతాదారుల నమ్మకంతో అభివృద్ధి బాట


మాట్లాడుతున్న సొసైటీ చైర్మన్ రాజు


సమావేశంలో పాల్గొన్న సొసైటీ సభ్యులు

సీతంపేట: ఖాతాదారులకు నమ్మకమైన సేవలందించడంతో సొసైటీ ఎంతో అభివృద్ధి సాధించిందని ది సిటిజన్ కో ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ పి.ఆర్.వి.పి.ఎస్.రాజు అన్నారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో గురువారం బ్యాంకు ఖాతాదారుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు రాష్ట్రాల్లోని 42 బ్రాంచీల్లో రూ.4 వేల కోట్ల లావాదేవీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. దేశంలో టాప్ టెన్ సొసైటీల్లో తమ బ్యాంకు స్థానం సంపాదించిందని, ఖాతాదారుల సహకారంతో మరింత ముందుకు తీసుకువెళ్తామని చెప్పారు. సొసైటీ మేనేజింగ్ డైరెక్టర్ కె.వి.సుబ్బయ్య మాట్లాడుతూ బ్యాంకు ఈ ఏడాది రూ.77 కోట్ల లాభం ఆర్జించిందని, గతేడాది షేర్ హోల్డర్స్‌కు 18 శాతం డివిడెండ్ చెల్లించడమే కాకుండా, సేవింగ్స్ ఖాతాపై 6.5 శాతం వడ్డీ, డిపాజిట్లపై 10 శాతం అత్యధిక వడ్డీ చెల్లిస్తున్నామని తెలిపారు. చదువులో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు పురస్కారాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ బొల్లిన ప్రభాకరరావు, బ్రాంచ్ మేనేజర్ ఎస్.ఎస్.నాయుడు, పెద్ద సంఖ్యలో సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా సూరజ్ ప్రకాష్ జయంతి


నివాళులర్పిస్తున్న పరిషత్ ప్రతినిధులు

సీతంపేట: భారత వికాస్ పరిషత్, ఝాన్సీ లక్ష్మీభాయి మహిళా శాఖ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం స్థానిక వాగ్దేవి పాఠశాల ఆవరణలో డాక్టర్ సూరజ్ ప్రకాష్ 104వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పరిషత్ పర్యావరణ పరిరక్షణ విభాగం వైస్ చైర్మన్ రమేష్ చంద్ జైన్ జ్యోతి ప్రజ్వలన చేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూరజ్ ప్రకాష్ స్థాపించిన భారత వికాస్ పరిషత్ దేశ మంతటా విస్తరించి వివిధ రాష్ట్రాల్లో 1,500 శాఖలతో లక్షన్నర మంది సభ్యులతో విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందిస్తూ ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతోందన్నారు. సూరజ్ ప్రకాష్ చిత్రపటం వద్ద పరిషత్ ప్రతినిధులు సత్యనారాయణ, భాస్కరరావు, మాణిక్యాలరావు, ఎం.వి.వి.సత్యనారాయణ, ఎం.వి.రాజశేఖర్, వెంకటేశ్వరరావు, శైలజ, పద్మశ్రీ, వనజ, మంజుల నివాళులర్పించారు.

రహదారిని ఆక్రమించి పనులు


నందగిరినగర్‌లో భవన నిర్మాణ సామగ్రితో బ్లాక్ చేసిన రోడ్డు

సీతంపేట: భవన నిర్మాణ యజమానులు కనీస బాధ్యత లేకుండా వ్యవహరిస్తూ చుట్టుపక్కల వారిని ఇబ్బందుల పాలు చేస్తున్నారు. జీవీఎంసీ 43వ వార్డు నందగిరినగర్‌లో చెక్కుడురాయి బిల్డింగ్ పక్కన పెద్ద భవన నిర్మాణం జరుగుతోంది. శ్లాబ్ వేయడానికి తెచ్చిన ఇసుక, పిక్క రోడ్డుపై పెద్ద కుప్పలుగా పోశారు. భవన నిర్మాణ సామగ్రితో రోడ్డు మొత్తం బ్లాక్ చేశారు. ఆఖరికి ద్విచక్ర వాహనాలు సైతం వెళ్లే వీలు లేకుండా రోడ్డును ఆక్రమించడంతో స్థానికులు, వాహన చోదకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నరేంద్రనగర్ నుంచి ఈ మార్గంలో ఎక్కువ మంది ప్రయాణిస్తుంటారు. వాహనాలు వెళ్లే వీలు లేక అవస్థల పాలయ్యారు. ఇష్టానుసారంగా రోడ్డు ఆక్రమించి భవన నిర్మాణ పనులు చేపడుతున్న వారిపై సంబంధిత అధికారులు చర్యలు పలువురు చేపట్టాలని కోరుతున్నారు.

కొండవాలులో పగటి వెలుగులు


శాంతినగర్‌లో పగటి పూట వెలుగుతున్న విద్యుత్ హైమాస్ట్ లైట్లు

కంచరపాలెం: జీవీఎంసీ 46వ వార్డు కొండవాలులో పట్టపగలు విద్యుత్ వెలుగులు విరజిమ్ముతున్నాయి. కైలాసపురం పరిధి శాంతినగర్, కస్తూరి నగర్, మధుసూదన్ నగర్ కొండవాలు ప్రాంతాల్లో రాత్రి వేళ వెలగని విద్యుత్ లైట్లు.. పగటి పూట వెలుగుతుండటం విద్యుత్ అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు కొండవాలు ప్రాంతాల్లో వీధిలైట్లు సక్రమంగా వెలగకపోవడంతో రాత్రి సమయంలో స్థానికులు, పాదచారులు నానా ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. కొండవాలులో విద్యుత్ స్తంభాలకు లైట్లు లేవని జీవీఎంసీ విద్యుత్ లైట్ల విభాగాధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. శాంతినగర్, మధుసూదన్ నగర్‌లో నాలుగు రోజులుగా పగటి పూట విద్యుత్ హైమాస్ట్ లైట్ల వెలుగులు విరజిమ్ముతున్నా పట్టించుకునే నాథుడే కనిపించడం లేదని చెబుతున్నారు. సంబంధిత అధికారులు పరిశీలించి తగు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

సిరులతల్లికి పంచామృతాభిషేకం



డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసులరెడ్డి, ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.